సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



క్రీడలతో మానసికోల్లాసం

నేటి పోటీ ప్రపంచంలో బాలికలకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యమేనని, క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని వైవీయూ ప్రొఫెసర్ జి.కాత్యాయిని పేర్కొన్నారు. -8లో



పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ విద్యా విప్లవం

పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ విద్యా విప్లవానికి సీఎం వైఎస్ జగన్ నాంది పలికారని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.3 /18.8

జిల్లాలో గురువారం 18.8 – 29.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు మెగా జాబ్‌మేళా

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాషా తెలిపారు. ఈ మేళాకు 15 బహుళజాతి కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పదోతరగతి నుంచి డిగ్రీ పాసైన అభ్యర్థుల వరకు ఈ ఎంపికల్లో పాల్గొనవచ్చన్నారు.

ఉచిత శిక్షణ

పులివెందుల రూరల్: పట్టణంలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రెనింగ్ అకాడమిలో గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు స్కిల్ కళాశాల ద్వారా అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ విద్యా కోర్సులో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి నాగార్జున గురువారం తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా చదివిన అభ్యర్థులుశిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు వసతి, భోజన సదుపాయాలు కలిస్తామన్నారు. వివరాలకు 6303328587, 9010532748 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పదోన్నతి జాబితా సిద్ధం

కడప అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌ఐలుగా పని చేస్తున్న వారిలో వివిధ బ్యాచ్‌ల వారికి సీఐలుగా పదోన్నతులిచ్చేందుకు సిఫారసు చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రాయలసీమ పరిధి (జోన్-4)లో 150 మంది ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతులు కల్పించేందుకు జాబితాను సిద్ధం చేశారు. ఇందులో వైఎస్‌ఆర్ జిల్లాలో 24 మంది, అన్నమయ్య జిల్లాలో ఏడుగురు ఉన్నారు. వీరితోపాటు వివిధ ప్రత్యామ్నాయశాఖ (లూప్‌లైన్)లలో పనిచేస్తున్న కొందరు కూడా జాబితాలో ఉన్నారు. త్వరలో అర్హులైనవారికి పదోన్నతి లభించనుంది.

నేడు శ్రీవారి పాదాల స్థూపం ఆవిష్కరణ



బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై నిర్మించిన శ్రీవారి పాదాల స్థూపం ఆవిష్కరణోత్సవం శుక్రవారం తెల్లవారుజామున నిర్వహిస్తున్నారు. ఘాట్‌రోడ్డు ప్రారంభం నుంచి కొండపై వరకు 9 కిలోమీటర్ల ఘాట్‌రోడ్డు ఉంది. ఈ రోడ్డులో కిందనుంచి పైకి వెళ్లేటప్పుడు నాలుగో మలుపు దాటుకొని వంద మీటర్ల దూరం వెళ్లాక అక్కడి ఎత్తుకు తిరుమలకొండ ఎత్తుకు సమానం. సరిగ్గా ఇదేస్థలంలో శ్రీవారి పాదాల స్థూపం నిర్మించారు.దీనిని శుక్రవారం మ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఆర్టీఓ మురళీ చేతులమీదుగా ఆవిష్కరించనున్నారు.

సంక్షేమ సారథికి.. సేవాహారతి

- ఘనంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు
- పాల్గొన్న డిప్యూటీ సీఎం. ఎంపీ. ఎమ్మెల్యేలు

కడప కార్పొరేషన్: జననేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించి ముఖ్యమంత్రి జగన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, మరో ముప్పై ఏళ్లపాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షించారు.

- కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంపీ రామచంద్రారెడ్డి, ఆర్టీసీ చైర్మన్ ఏ. మల్లికార్జునరెడ్డిలు భారీ కేక్‌ను కట్ చేసి, ఒకరినొకరు పంచుకున్నారు. అనంతరం పేదలకు పండ్లు, దుప్పట్లు, చీరెలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు రహీమ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి పాల్గొన్నారు.
- పులివెందుల పట్టణంలో వైఎస్ జగన్ జన్మదిన సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ స్వయంగా రక్తదానం చేసి యువతకు స్ఫూర్తిగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. బాకరాపురం వెంకటప్ప స్కూల్ విద్యార్థులు ' హ్యాపీ బర్త్ డే జగన్ సార్' అని అక్షరమాల రూపొందించారు. నల్లపురెడ్డిపల్లె జెడ్పీ స్కూల్‌లో విద్యార్థులకు మిఠాయిల బాక్స్, స్టీల్ వాటర్ బాటిళ్లను, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు.
- ప్రొద్దుటూరు పట్టణంలోని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన, అవయవదాన శిబిరాలను నిర్వహించారు. 474 మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. అవేయవదానం చేస్తానని ఎమ్మెల్యే రాచమల్లు హామీ పత్రం ఇచ్చారు. అలాగే రామేశ్వరం జగనన్న కాలనీలో సీఎం వైఎస్ జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని 1000 ఇళ్లలో గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించారు. ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీ, పద్మశాలీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మెన్ బి. లక్ష్మిదేవి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ యాదవ్ ఆధ్వర్యంలో అన్వర్ థియేటర్ వద్ద కేక్ కట్ చేసి సీఎం జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
- బద్వేల్ పట్టణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డా. దాసరి సుధ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.నిరాశ్రయుల వసతి గృహంలోని వృద్ధులకు పండ్లు, ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు అన్నదానం చేశారు. బద్వేల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మెన్ రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- మైదుకూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.
- కమలాపురంలో నిర్వహించిన జగనన్న జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనాథ పిల్లల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మించిన జమ్మలమడుగు క్యాంప్‌బెల్ హాస్పిటల్‌లో ఎమ్మెల్యే డా. సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో 51 కేజీల కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం 2వేల మందికి అన్నదానం చేశారు.



పులివెందుల : కేక్‌ను కట్ చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి



కడపలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు



పోరుమామిళ్ల: జగనన్న జన్మదిన వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి



బద్వేలు: వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ



మైదుకూరులో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



ప్రొద్దుటూరులో జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇంటి తాళం చెవి అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



కమలాపురం: దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి



జమ్మలమడుగులో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఆర్టీసీ బస్సుల దారిమళ్లింపు



కడప కోటిరెడ్డి సర్కిల్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శనివారం(23న) కడపలో పర్యటించనున్న సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఆదేశానుసారం ఆర్టీసీ బస్సులను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దారి మళ్లించినట్లు కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వర్‌రావు తెలియజేశారు. ఈ సమయంలో బస్సులేవీ ఆర్టీసీ కొత్త, పాత బస్టాండ్‌లకు రావన్నారు.

- తిరుపతి, రాజంపేట, బద్వేల్, నెల్లూరు రూట్ బస్సులు వైఎస్‌ఆర్ సర్కిల్, చిన్నచౌక్, అప్సర మీదుగా మున్సిపల్ గ్రౌండ్ నుంచి వెళతాయన్నారు.
- రాయచోటి, బెంగుళూరు రూట్ బస్సులు ఆర్టీఓ ఆఫీసు, ఊటుకూరు సర్కిల్ నుంచి వెళతాయన్నారు.
- ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, కమలాపురం, తాడిపత్రి, అనంతపురం, కర్నూలు, హైదరాబాద్ రూట్ బస్సులు అలంఖాన్ పల్లి వద్ద పాత టోల్‌గేటు నుంచి వెళతాయన్నారు.
- పులివెందుల రూట్ బస్సులు బిల్టప్ వద్దనున్న ఈద్గా నుంచి వెళతాయన్నారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించి ఆర్టీసీకి సహకరించాలని ఢిల్లీశ్వర్‌రావు కోరారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: పుణ్యక్షేత్రాల పేరిట ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడపనున్నట్లు అన్నమయ్య జిల్లా ప్రజారవాణాధికారి రాము అన్నారు. గురువారం స్థానిక టు డిపో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి తిరువణ్ణామలైకి ప్రతి డిపో నుంచి స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. అయ్యప్పమాలాధారులకు శబరిమలైకి స్పెషల్ బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ములకలచెరువు ఆర్టీసీ బస్టాండులోని ఖాళీ స్థలం లీజుకు ఇవ్వనున్నట్లు డీటీఓ రాము తెలిపారు.

రేపటి నుంచి సీఎం పర్యటన

- జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు

కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. వివిధ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో పాల్గొంటారు. ఈ మేరకు అధికారిక సమాచారం అందింది.

23వ తేదీన..

- ఉదయం 10.30 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 10.45 గంటలకు హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 11.05 గంటలకు గోపవరం వద్దనున్న సెంచురీ ప్లై ఇండస్ట్రీస్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 11.20 గంటల వరకు అక్కడి నాయకులతో ముచ్చటిస్తారు.
- అనంతరం రోడ్డు మార్గాన బయలుదేరి 11.25 గంటలకు సెంచురీ ప్లై ఇండస్ట్రీస్ వద్దకు చేరుకుంటారు.
- 11.25 నుంచి 11.30 గంటల వరకు ఇండస్ట్రీ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- 11.45 గంటల వరకు ఆ పరిశ్రమ చైర్మన్‌తో మాట్లాడతారు.
- 11.45 నుంచి 11.55 గంటల వరకు మీడియం డెన్సిటీ ఫైబర్ ప్లాంట్ కంట్రోల్ రూమ్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- 11.55 నుంచి మధ్యాహ్నం 12.10 గంటల వరకు హై ప్రెజర్ ల్యామినేట్ ప్లాంట్ ప్రారంభిస్తారు.
- 12.15 గంటల వరకు అక్కడి ఉద్యోగులతో ముచ్చటిస్తారు. అనంతరం రోడ్డు మార్గాన బయలుదేరి 12.20 గంటలకు హెలిప్యాడ్ చేరుకుంటారు.
- 12.25 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 12.45 గంటలకు కడపలోని రిమ్స్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.50 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 12.55 గంటలకు డాక్టర్ వైఎస్సార్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్దకు చేరుకుని 1.15 గంటల వరకు ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- 1.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 1.20 గంటలకు డాక్టర్ వైఎస్సార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ వద్దకు చేరుకుని 1.35 గంటల వరకు ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 1.40 గంటలకు డాక్టర్ వైఎస్సార్ క్యాన్సర్ కేర్ బ్లాక్ వద్దకు చేరుకుని 1.55 గంటల వరకు ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి 2.00 గంటలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వద్దకు చేరుకుని 2.20 గంటల వరకు ప్రారంభిస్తారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 2.25 గంటలకు వైఎస్సార్ క్రికెట్ స్టేడియానికి చేరుకుని 2.40 గంటల వరకు అక్కడి ఫ్లడ్‌లైట్స్ ప్రారంభిస్తారు.
- అక్కడి నుంచి బయలుదేరి 2.50 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. దివ్యాంగులకు ట్రై స్కూటర్ల పంపిణీలో 2.55 గంటల వరకు గడుపుతారు.
- 2.55 గంటల నుంచి 3.00 గంటల వరకు అగ్నిమాపకశాఖకు రెస్క్యూ ఎక్విప్‌మెంట్ అందజేస్తారు.
- 3.00 నుంచి 3.10 గంటల వరకు పునర్నించిన కలెక్టరేట్‌ను ప్రారంభిస్తారు. అనంతరం కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌ను సందర్శిస్తారు.
- 3.20 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 3.25 గంటలకు అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకుంటారు.
- 3.25 నుంచి 3.35 గంటల వరకు రోడ్డు వెడల్పు పనులను ప్రారంభిస్తారు.
- 3.35 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 3.38 గంటలకు వై జంక్షన్‌కు చేరుకుంటారు. 3.48 గంటల వరకు అక్కడి అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు.
- అనంతరం బయలుదేరి 3.55 గంటలకు కోటిరెడ్డిసర్కిల్‌కు చేరుకుని 4.05 గంటల వరకు అక్కడ అభివృద్ధి చేసిన పనులను ప్రారంభిస్తారు.
- అనంతరం అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 4.10 గంటలకు ఏడురోడ్ల కూడలి వద్దకు చేరుకుని అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. అక్కడి నుంచే మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న అంతర్జాతీయ హాకీ కోర్టుకు శంకుస్థాపన చేస్తారు.
- 4.20 గంటలకు ఏడురోడ్ల కూడలి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 4.35 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 4.45 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 5.00 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 5.10 కు అక్కడి నుంచి బయలుదేరి 5.15 కు గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.



24వ తేదీన..

- ఉదయం 8.15 గంటలకు ఇడుపులపాయ నివాసం నుంచి బయలుదేరి 8.20 గంటలకు వైఎస్సార్ ఘాట్‌కు చేరుకుంటారు.
- 8.30 గంటల వరకు ఘాట్‌లో జరిగే ప్రార్థనల్లో పాల్గొని నివాళులర్పిస్తారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 8.40 గంటలకు అక్కడి ప్రార్థనా మందిరానికి చేరుకుంటారు.
- 8.40 నుంచి 11.30 గంటల వరకు అక్కడ జరిగే ప్రార్థనల్లో పాల్గొంటారు.
- 11.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11.35 గంటలకు వైఎస్సార్ ఎస్టేట్‌కు చేరుకుంటారు. అక్కడ 11.45 గంటల వరకు గడుపుతారు.
- అనంతరం అక్కడ బయలుదేరి 11.50 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 12.00 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.20 గంటలకు సింహాద్రిపురం జూనియర్ కళాశాల సమీపాన ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.20 నుంచి 12.40 గంటల వరకు సింహాద్రిపురం మండల ప్రజాప్రతినిధులతో మాట్లాడుతారు.
- 12.40కు అక్కడి నుంచి బయలుదేరి 12.45 గంటలకు సింహాద్రిపురం ప్రధాన రహదారి జంక్షన్‌కు చేరుకుంటారు.
- అక్కడ 12.45 నుంచి 12.55 గంటల వరకు రోడ్డు వెడల్పు, సుందరీకరణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 1.00 గంటకు సింహాద్రిపురంలో నిర్మించిన వైఎస్సార్ పార్క్ వద్దకు చేరుకుని 1.20 గంటల వరకు ఆ పార్క్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి తహసీల్దార్ కార్యాలయానికి 1.25 గంటలకు చేరుకుంటారు. ఆ కార్యాలయ ప్రారంభోత్సవంలో 1.45 గంటల వరకు గడుపుతారు.
- అనంతరం అక్కడ బయలుదేరి 1.50 గంటలకు కొత్తగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుంటారు. 2.05 గంటల వరకు ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- అనంతరం 2.10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని దాని ప్రారంభోత్సవ కార్యక్రమంలో 2.25 గంటల వరకు గడుపుతారు.
- ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి 2.30 గంటలకు హెలిప్యాడ్ చేరుకుంటారు.
- 2.35 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 3.00 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్‌లో దిగుతారు.
- 3.05 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 3.10 గంటలకు ఎకో పార్క్ మీటింగ్ ప్రదేశానికి చేరుకుంటారు.
- 3.10 నుంచి 4.40 గంటల వరకు పులివెందుల మండల ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు.
- 4.40 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 4.45 గంటలకు గెస్ట్‌హౌస్‌కు చేరుకుని ఆ రాత్రి అక్కడే బస చేస్తారు.

25వ తేదీన..

- ఉదయం 8.15 గంటలకు గెస్ట్‌హౌస్ నుంచి బయలుదేరి 8.20 గంటలకు హెలిప్యాడ్ చేరుకుంటారు.
- 8.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 8.50 గంటలకు పులివెందుల పట్టణం భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 8.55 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 9.05 గంటలకు సీఎస్ఐ చర్చికి చేరుకుంటారు.
- 9.05 నుంచి 11.15 గంటల వరకు సీఎస్ఐ చర్చి ప్రార్థనల్లో పాల్గొంటారు.
- 11.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11.25 గంటలకు భాకరాపురం హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 11.30 గంటలకు అక్కడ బయలుదేరి 12.00 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 12.10 గంటలకు విమానంలో బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి వెళతారు.
- 01.20కు సీఎం నివాసానికి చేరుకుంటారు.

ఉద్యోగ సిరులు




సెంచురీ ప్యానెల్స్ సంస్థ

- రేపు సీఎం చేతుల మీదుగా సెంచురీ పానెల్స్ పరిశ్రమ ప్రారంభం
- ప్రభుత్వ నిర్ణయంతో స్థానికులకు ఉపాధి
- యువత మోములో ఆనందం



ఈ యువకుడి పేరు ఎస్.లక్ష్మీనరసింహప్రసాద్. బద్వేలు పట్టణం ఎగువ బ్రాహ్మణవీధి నివాసి. ఐదేళ్ల క్రితం ఎలక్ట్రికల్ డిప్లొమా పూర్తి చేశాడు. తండ్రి మరణించడంతో ఉద్యోగం చేసి కుటుంబానికి అండగా నిలవాలనుకున్నాడు. ఈ పరిస్థితిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గోపవరం మండలంలో సెంచురీ ప్యానెల్స్ సంస్థను ఏర్పాటు చేశారు. స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలనే ప్రభుత్వ నిబంధనలతో ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఉద్యోగం దక్కింది. ఉన్న ఊరిలోనే ఉపాధి లభించడంపై లక్ష్మీనరసింహప్రసాద్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఇతని పేరు ఎస్.హరీష్. బద్వేలులోని అబ్బరాతివీధి నివాసి. ఎలక్ట్రికల్ డిప్లొమా పూర్తి చేసి హైదరాబాద్‌లో పని చేస్తుండేవాడు. స్థానికంగా అవకాశాల కోసం ఎదురుచూసేవాడు. సెంచురీ పానెల్స్ పరిశ్రమలో ప్రొడక్షన్,క్వాలిటీ ఆపరేటర్ ఉద్యోగం దక్కింది. తల్లిదండ్రుల చెంతనే ఉండటం ఆనందంగా ఉందని హరీష్ చెబుతున్నాడు.

సాక్షి ప్రతినిధి, కడప: పారిశ్రామిక ప్రగతి సాధించాలనే కృతనిశ్చయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు. అందుకు తగ్గట్లు ప్రణాళికలు రచిస్తూ, పెట్టుబడులను సమకూరుస్తూనే, పారిశ్రామికవేత్తలకు అనువుగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఫలితంగా నిర్ణయించిన గడువు కంటే ఏడాది ముందే ఉత్పత్తులు ప్రారంభించేలా సెంచురీ ప్యానెల్స్ సంస్థ రూపుదిద్దుకుంది. గోపవరం సమీపంలోని నెల్లూరు రహదారిలో రూ.956 కోట్లతో అంచనాతో చేపట్టిన ఈ పరిశ్రమ నిర్మాణానికి 2021 డిసెంబరు 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పరిశ్రమకు అవసరమైన మౌలిక సదుపాయాల పట్ల దృష్టి సారించారు. బ్రహ్మంసాగర్ నుంచి 0.07టీఎంసీ నీరు సరఫరాకు అవసరమైన అనుమతులిచ్చి రూ.45కోట్లుతో పైపులైన్ పనులు 6 నెలల్లో పూర్తి చేశారు. రూ.19.1కోట్లతో 132కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. స్థానికులకు ప్రత్యక్ష ఉద్యోగావకాశాలు లభించాయి. 2662 ఉద్యోగాలు ఉండగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం 75 శాతం స్థానికులకు ఇవ్వాల్సి ఉంది.అయితే ఇప్పటికి 78శాతం మందికి చైర్మన్ సజ్జన్ భజాంకా అవకాశం కల్పించడం విశేషం.

- సెంచురీ ప్యానెల్స్ పరిశ్రమ 589.23 ఎకరాల్లో రూ.956 కోట్ల అంచనాతో శ్రీకారం చుట్టినా పెట్టుబడులు రూ.1600 కోట్లకు చేరాయి. 2024 డిసెంబర్ నాటికి ఉత్పత్తి లక్ష్యం కాగా, 2023 డిసెంబర్ నాటికి రెండు దశల పనులు కూడా పూర్తి చేశారు. కాగా ఈపరిశ్రమ ద్వారా పరోక్షంగా మరో 4వేల మందికి ఉపాధి దక్కనుంది.
- లక్ష్యానికి ఏడాది ముందే నిర్మించిన సెంచురీ ప్యానెల్స్ సంస్థను శనివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

ఉన్న ఊరిలోనే ఉద్యోగాలు



ప్రభుత్వ ముందుచూపు వల్ల స్వగ్రామాల్లోనే యువతకు ఉద్యోగావకాశాలు లభించాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెంచురీ ప్లైబోర్డ్స్ సంస్థను గోపవరం సమీపంలో నెలకొల్పారు. రేపు సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. - డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్సీ

గడువు కంటే ముందే పూర్తి



పరిశ్రమ పనులు వేగంగా పూర్తయ్యాయి. అవసరమైన నీరు, విద్యుత్ సరఫరా పనులను ప్రభుత్వం 6 నెలల్లో సమకూర్చింది. చైర్మన్ సజ్జన్ భజాంకా చొరవ తీసుకొని రెండోదశ పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు.
-రమేష్‌కుమార్‌రెడ్డి, జీఎం, సెంచురీ పానెల్స్

క్లుప్తంగా

ప్రొద్దుటూరులో ఐటీ సోదాలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో ఉన్న కేసీ పుల్లయ్య ఇంట్లో గురువారం ఐటీ అధికారులు సోదాలు చేశారు. కేసీపీ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కొన్నేళ్ల నుంచి పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని కేసీపీ కార్యాలయంలో ఐటీ అధికారులు సాధారణ తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. అయితే కంపెనీ నిర్వాహకుల అడ్రస్ ప్రొద్దుటూరు అని ఉండటంతో ఇక్కడ కూడా తనిఖీలు చేశారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప–కనుమలోపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి(55) మృతి చెందినట్లు కడప రైల్వే సీఐ నాగార్జున తెలిపారు. సీఐ వివరాల మేరకు మృతుడి కుడి మోచేతిపైన శివుని బొమ్మ కలిగిన పచ్చబొట్టు ఉందన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే ఎస్‌ఐ రారాజు ఫోన్ నంబర్ 9440900811, సీఐ నాగార్జున 9440627398 నంబర్లలో సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు



దుగ్గన్నగారిపల్లె వద్ద ఆటోను ఢీకొన్న కారు

వేముల : మండలంలోని దుగ్గన్నగారిపల్లె బస్టాప్ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంజనేయులు, కిరణ్ అనే ఇరువురు గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందుల శ్రీమిట్ట మల్లేశ్వరస్వామి ఆలయ పూజారి కడప నుంచి పులివెందులకు కారులో బయలుదేరారు. అదే సమయంలో వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లెకు చెందిన కొంతమంది పుట్టకోనమ్మ ఆలయం వద్ద మొక్కులు తీర్చుకుని ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో కడప నుంచి వస్తున్న కారు ఆటోను ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మద్యం సేవించి ఆటో నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

కడప అర్బన్ : మద్యం సేవించి ఆటో నడుపుతూ పోలీసు తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి 7 రోజుల జైలు శిక్షతో పాటు, రూ. 2500 జరిమానా విధిస్తూ కడప ఫస్ట్ స్పెషల్ జేఎస్‌సీఎం కోర్టు గురువారం తీర్పు చెప్పింది. చల్లా నారాయణ స్వామి (36) అనే వ్యక్తి ఈనెల 19న మద్యం సేవించి ఆటో నడుపుతూ ట్రాఫిక్ పోలీసుల బ్రీత్ అనలైజర్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో కోర్టు శిక్ష విధించినట్లు కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ విద్యా విప్లవం

- విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం
- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ విద్యా విప్లవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాంది పలికారని అందుకు అనుగుణంగానే చిన్నారులకు ప్రభుత్వం ట్యాబ్‌లతోపాటు పాఠశాలలకు ఐఎఫ్‌పి ప్యానెల్, స్మార్ట్ టీవీలను అందిస్తోందని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని గత ఏడాది డిసెంబర్ 21 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు అందించి విప్లవాత్మక మార్పులకు నాంది పలికారన్నారు. గురువారం జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం పండుగలా జరిగింది. ఇందులో భాగంగా కడప జయనగర్‌కాలనీ జిల్లా పరిషత్తు బాలికల హైస్కూల్లో డీఈఓ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఎంఈఓ పాలెం నారాయణ అధ్యక్షతన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం విద్యకు ఇవ్వనంత ప్రాధాన్యం మన ప్రభుత్వం ఇస్తోందన్నారు. దీంతోపాటు ఏ తల్లి తమ బిడ్డల చదువుకు ఆర్థిక ఇబ్బంది పడకుండా ఉండేందుకు అమ్మ ఒడి పేరుతో తల్లుల ఖాతాలకు నగదును వేస్తూ వాళ్ల కళ్లలో ఆనందాన్ని నింపుతున్నారన్నారు. అలాగే ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశ పెట్టి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు మన బడి నాడు నేడు ద్వారా రూపురేఖలు మార్చారన్నారు. ఉన్నత విద్య కోసం జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, విదేశ విద్యాదీవెన వంటి అనేక కార్యక్రమాలను గత ఐదేళ్ల నుంచి అమలు చేస్తూ ముందుకు పోతోందన్నారు. డీఈఓ రాఘవరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలు, విద్యార్థుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. అనంతరం విద్యార్థులకు డిప్యూటీ సీఎం, డీఈఓల చేతుల మీదుగా ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బైజూస్ నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, కడప మార్కెట్‌యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్య, 10, 30వ డివిజన్ కార్పొరేటర్లు మల్లికార్జున, షఫీ, 9వ డివిజన్ ఇన్‌చార్జి కిరణ్‌లతోపాటు పలువురు నాయకులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, డీఈఓ రాఘవరెడ్డి

జగన్ మామకు థ్యాంక్స్



ప్రభుత్వ పాఠశాలలో చదివే మాకు ట్యాబ్‌ను అందించి మా చదువును ప్రోత్సహించడంతో పాటు వీటి ద్వారా డిజిటల్ విద్యను అందించడం చాలా సంతోషంగా ఉంది. మా గురించి మా చదువుల గురించే నిత్యం ఆలోచించే ముఖ్యమంత్రి జగన్ మామకు ప్రత్యేక ధన్యవాదాలు. బాగా చదివి డాక్టర్ అవుతా. – శరణ్య, 8వ తరగతి విద్యార్థి.

కలలో కూడా ఊహించలేదు



మేము ట్యాబ్‌ల ద్వారా చదువుకుంటామని కలలో కూడా ఊహించలేదు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే మాకు ఇంతటి అదృష్టాన్ని కల్పించినందుకు చాలా సంతోషంగా ఉంది. బాగా చదివి మా తల్లిదండ్రులతోపాటు ముఖ్యమంత్రి పేరు నిలబెడతా. – భావన, 8వ తరగతి విద్యార్థి.

ప్రతి నిమిషం మా గురించే ఆలోచన



మా గురించి మా తల్లిదండ్రులు కూడా ఇంతగా ఆలోచించరు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మామ మాత్రం ప్రతి నిమిషం మా గురించి ఆలోచించి మాకు ఏం కావాలో అన్ని సమకూరుస్తున్నారు. ఇందుకు ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం. – సుమ, 8వ తరగతి విద్యార్థి.

చాలా సంతోషంగా ఉంది



ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న మాకు పుస్తకాల దగ్గర నుంచి బ్యాగు, యూనిఫాం, బెల్ట్, షూ, నోట్‌బుక్స్‌తో పాటు నేడు ట్యాబ్‌ను కూడా అందించారు. చాలా సంతోషంగా ఉంది. – ఇమాంబీ, 8వ తరగతి విద్యార్థి.

నవశకం

మట్టి మిద్దెతో ఇబ్బంది పడేవాళ్లం



గతంలో మేము మట్టి మిద్దెలో నివాసం ఉండేవాళ్లం. వర్షం వచ్చినప్పుడు ఇబ్బందులు పడేవాళ్లం. కొత్తగా ఇల్లు మంజూరు చేయాలని గత ప్రభుత్వంలో అధికారులను కోరినా మంజూరు చేయలేదు. ప్రస్తుతం కొత్తగా ఇళ్లు వచ్చాయని మా వలంటీర్ ద్వారా తెలుసుకుని పత్రాలు ఇచ్చాను. ఇల్లు మంజూరైందని తెలపడంతో ఇంటి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకున్నాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు – మోదినమ్మ, వెలవలి గ్రామం, రాజుపాళెం మండలం.

సర్కారు బడుల్లో సకల వసతులు



గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయం. ప్రభుత్వ పాఠశాలలకు నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా అత్యాధునిక భవనాలు, మరుగు దొడ్లు, తాగేందుకు మంచినీరు వంటి సదుపాయాలను కల్పించారు. విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుతోంది. జగనన్న కానుక విద్యార్థులకు వరం లాంటిది. డిజిటల్ విద్యా బోధన ఎంతగానో ఉపయోగపడుతుంది. – వడ్డిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, జిల్లా పరిషత్ హైస్కూల్, సిద్దవటం

రచయితల సభల్లో పుస్తకావిష్కరణలకు అవకాశం

కడప కల్చరల్ : కడప నగరంలోని జిల్లా పరిషత్ హాలులో శని, ఆదివారాల్లో నిర్వహించనున్న వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం మహాసభల్లో పుస్తకావిష్కరణలు, ప్రదర్శనలకు రచయితలకు అవకాశం కల్పిస్తున్నామని సంఘం అధ్యక్షుడు, కార్యక్రమ నిర్వాహకుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని కవులు, రచయితలు గతంలో ఆవిష్కరించని తమ పుస్తకాలను ఈ సభల్లో ఆవిష్కరించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే పుస్తకాలను సభల్లో ఏర్పాటు చేయనున్న స్టాల్‌లో ప్రదర్శన, అమ్మకాలకు ఉంచవచ్చన్నారు. వీటితోపాటు జిల్లాకు సంబంధించిన పురాతన నాణేలు, చారిత్రక వస్తువులను జిల్లా కవులు, కళాకారులు, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలు, రాతప్రతులను కూడా ఈ ప్రదర్శనలో ఉంచుతామని తెలిపారు. తమ వద్ద ఈ వస్తువులు ఉన్న వారు వెంటనే తమను సంప్రదించాలని కోరారు.. జిల్లా చరిత్ర, కళ, సాహిత్య వైభవాలను చాటే వస్తువులు, పుస్తకాలు ఉన్న వారు కూడా ప్రదర్శన ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడలను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ కాత్యాయిని



పరుగు పందెంలో పాల్గొన్న బాలికలు

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో అట్టహాసంగా ప్రారంభమైన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో బాలికలకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యమేనని, క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని యోగివేమన విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ జి. కాత్యాయిని పేర్కొన్నారు. గురువారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2023–24 రెండు రోజుల కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన వైవీయూ ప్రొఫెసర్ డాక్టర్ కాత్యాయినీ, జిల్లా నోడల్ ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో మనం రాణించాలంటే చదువుతోపాటు క్రీడలు కూడా చాలా అవసరం అన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. ఈ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో కడప, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి 162 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

వ్యవసాయం గౌరవ ప్రదమైన వృత్తి

జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు

కడప అగ్రికల్చర్ : వ్యవసాయం చాలా గౌరవ ప్రదమైన వృత్తి అని భవిష్యత్తులో వ్యవసాయంలో యాంత్రీకరణ ద్వారా మంచి ఫలితాలు పొందుతామని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం కడప ఊటుకూరు ఏరువాక కేంద్రంలో కో ఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో వరి, పత్తిపంటలో డ్రోన్‌లను ఉపయోగించి సస్యరక్షణ చేయడంపై వేముల, వేంపల్లి, ప్రొద్దుటూరు, దువ్వూరు మండలాలకు చెందిన ఎఫ్‌పీఓ రైతులు, ఎఫ్‌పీఓ అధికారులు, మహిళా రైతులకు అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో డ్రోన్‌ల పాత్ర చాలా కీలకమన్నారు. వాటితో వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని అన్నారు. ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ డ్రోన్‌లతో మందుల పిచికారీ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, వ్యవసాయ పరిశోధన స్థానం కీటక విభాగ శాస్త్రవేత్త సునీల్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ, రామలక్ష్మీదేవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు సీఐల మానవత్వం

గాయపడిన వారిని పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలించిన అధికారులు



గాయపడిన యువకుడిని పరిశీలిస్తున్న సీఐ ఇబ్రహీం

ప్రొద్దుటూరు క్రైం : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు యువకులను తమ వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రొద్దుటూరు సీఐలు ఇబ్రహీం, రమణారెడ్డిలు మానవత్వం చాటుకున్నారు. సీఎం బందోబస్తు సందర్భంగా గురువారం కడపలో మీటింగ్ ముగించుకొని రాత్రి సీఐలు ఇద్దరు ప్రొద్దుటూరుకు బయలుదేరారు. అయితే చాపాడు సమీపంలోని సీబీఐటీ కళాశాల సమీపంలో లారీ– మోటార్ బైక్ ఢీకొన్న సంఘటనలో వృద్ధురాలు అక్కడికక్కడే చనిపోగా ఇరువురు యువకులు తీవ్రంగా గాయపడి నడిరోడ్డుపై పడి ఉన్నారు. రూరల్ సీఐ రమణారెడ్డి, టూ టౌన్ సీఐ ఇబ్రహీంలు స్పందించి గాయపడ్డ వారిని తమ వాహనంలో ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులతో మాట్లాడి యువకులకు వైద్యం అందించారు. గాయపడిన యువకులు ప్రొద్దుటూరుకు చెందిన మున్నా, ఫకృద్దీన్‌లుగా గుర్తించారు.

టిప్పర్ ఢీ కొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన బాలాజీ

పుల్లంపేట : మండల పరిధిలోని పుత్తనవారిపల్లి గ్రామంలో గురువారం రాత్రి 8 గంటలకు తిరుపతి నుంచి రాజంపేటకు వెళ్తున్న టిప్పర్ రోడ్డు దాటుతున్న బాలాజీ(30)ని ఢీ కొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పుల్లంపేట ఎస్‌ఐ రఘురాం సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

24న రాష్ట్రస్థాయి తాళ భజన పోటీలు

రాజుపాళెం : మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వాముల ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 24న ఆదివారం రాత్రి రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో తాళ భజన పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం హనుమద్వ్రత మహోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు ఒకే గ్రామానికి చెందిన వారై ఉండాలని చెప్పారు. భజన సంఘంలో 8 నుంచి 12 మంది వరకు ఉండవచ్చన్నారు. పోటీలో పాల్గొనేవారి ఆధార్ కార్డు, ఫొటోలతో ఈనెల 24 సాయంత్రం లోపు భజన సంఘం పేరును నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9948308196 నంబరులో సంప్రదించాలని వారు సూచించారు.

వైఎస్ జగన్ పాలనపై ప్రజల్లో విశ్వాసం


- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- ఎర్రముక్కపల్లెలో పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజల్లో విశ్వాసం ఏర్పడిందని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. గురువారం స్థానిక ఎర్రముక్కపల్లెలో 21వ డివిజన్ ఇన్‌చార్జి ఎం. సుబ్బరాయుడు, పార్టీ సీనియర్ నాయకుడు ఎంవీఆర్ ప్రసాద్‌రెడ్డిల ఆధ్వర్యంలో 50 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ అంజద్‌బాషా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ తు.చ తప్పకుండా అమలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నవరత్న పథకాల వల్ల ప్రతి కుటుంబానికి లబ్ధి కలిగిందని తెలిపారు. అందుకే చాలామంది వైఎస్సార్‌సీపీ పట్ల ఆకర్షితులవుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో చలమారెడ్డి, శివ, ప్రతాప్‌రెడ్డి, మల్లికార్జున, విజయ్, తన్నీరు సురేంద్ర, సంజీవరావు, శ్రీధర్, రాజా, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, హేమంత్ యాదవ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, లక్ష్మయ్య, ఐవ్ బాబు, రమణ పాల్గొన్నారు.


అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతిచెందిన వెంకటేష్

మదనపల్లె : పట్టణంలోని శివాజీనగర్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం వెలుగుచూసింది. వైఎస్సార్ జిల్లా చాపాడు మండలం తప్పెట ఓబాయపల్లె గ్రామానికి చెందిన ఓబన్న కుమారుడు బి.వెంకటేష్(40) వృత్తిరీత్యా వెల్డర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బతుకుతెరువులో భాగంగా నెలరోజుల క్రితం స్వగ్రామం నుంచి మదనపల్లెకు చేరుకుని శివాజీనగర్‌లో అద్దె ఇల్లు తీసుకుని నివాసం ఉంటున్నాడు. ఎస్టేట్‌లోని రామకృష్ణ వెల్డింగ్‌షాప్‌లో పనిచేస్తున్నాడు. గురువారం వెంకటేష్ పనికి రాకపోవడంతో వెల్డింగ్‌షాపులోని తోటిపనివారు మధ్యాహ్నం సెల్‌కు ఫోన్‌చేశారు. ఫోన్ రింగ్ అవుతున్నప్పటికీ సమాధానం రాకపోవడంతో సాయంత్రం ఏమైందోనని ఇంటివద్దకు వెళ్లారు. ఇల్లు తాళం వేసి ఉండగా, కిటికీలో నుంచి లోపలకు చూశారు. ఇంటిలో అనుమానాస్పద స్థితిలో పడి ఉన్న వెంకటేష్‌ను చూసి చనిపోయి ఉంటాడని భావించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి సమాచారం సేకరించారు. ఇల్లు తాళం వేసి ఉండటం, కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ఇంటి తాళం తెరవలేదు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు తెలిపారు. వారు వచ్చిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలిస్తామని పోలీసులు చెప్పారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఇన్‌చార్జి సీఐ వలీబాషు, ఎస్‌ఐ ఇనయతుల్లా తెలిపారు.

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి



వాలీబాల్ ఆడుతున్న బెటాలియన్ పోలీసులు

సిద్దవటం : ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో జరిగే క్రీడా పోటీలలో పోలీసు సిబ్బంది గెలుపోటములను సమానంగా తీసుకోవాలని బెటాలియన్ కమాండెంట్ ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో గురువారం రెండవ రోజు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2023 పోటీలు జరిగాయి. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కె. ప్రభుకుమార్, అసిస్టెంట్ కమాండెంట్లు కె. వెంకట్‌రెడ్డి, వి. కేశవరెడ్డి, వి. జయప్రసాద్, పి.ఎస్.డి. ప్రసాద్, ఆర్ఐలు, ఆర్‌ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

పసికందు మృతదేహం కలకలం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీకృష్ణమందిరం సమీపంలో రోడ్డు పక్కన ఓ పురిటిబిడ్డ మృతదేహం కనిపించడం కలకలం రేపింది. పూర్తిగా అవయవాలు కూడా ఏర్పడని మగశిశువు మృతదేహం రోడ్డు పక్కన పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. శిశువు మృతదేహం ఆనవాళ్లను బట్టి చూస్తే అబార్షన్ చేయించుకుని మృతదేహాన్ని రోడ్డు పక్కన వదిలివేసినట్లు తెలుస్తోంది.

జూదరుల అరెస్టు

ముద్దనూరు : మండలంలోని వేల్పుచెర్ల గ్రామ శివారులో గురువారం పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.7,100ల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.